# మాతృప్రేమ

**వేంకట కాళిదాసకవులు**

ఆశ్వయుజమాసము. ఆకసమునడుమనున్న సూర్యబింబము మేఘావృతము.

వీధిగుమ్మముకడ నొకబండి యాగినది.

"బాబుగారి యిల్లు ఇదిగో వచ్చినదే!" అనుచు తటాలున క్రిందకుదిగినాఁడు పదియేండ్ల బాలుఁడు. అతనిముఖము హృదయావేగముతో వికసించినది.

"నాయనా! తాపీ!" అనుచు వృద్ధుఁ డొకఁడు బాలునివెంట బండిలో నుండి దిగినాఁడు. బండివాఁడు సామానులందీయుచుండ నతఁడు చూచుచున్నాఁడు.

అప్రయత్నము, అనాలోచితమునగు మనోవేగమో, సద్యోవిచ్ఛిన్నచిర వియోగజనితమగు హృదయసంభ్రమమో ఆబాలుని నటనుండి క్షణకాలమున లోనికిఁగొనిపోయినది.

పాషాణఘాతమునకు జలధితరంగమువలె నతనిగమనము నట్టింటిద్వారము కడ నాగిపోయినది.

నలుబదియేండ్లు దాటిన బ్రాహ్మణుఁడు, ముగ్గురుకుమారులు పంక్తిఁదీర్చి భోజనములుచేయఁ గూర్చుండిరి. మడిఁగట్టుకొని యిల్లాలు వడ్డించుచున్నది. పసుపుపూసిన నెమ్మొగము; చక్కని కుంకుమబొట్టు. ఆగృహలక్ష్మి పూజ్యురాలు!

ప్రథమవీక్షాపతితమగు నీదృశ్యము బాలునిగమనము నరికట్టినది. అతని వాఙ్మనఃప్రవృత్తులుగూడఁ గట్టువడినవి. ద్వారమునకుఁజేరఁబడి కాలుఁగదలించుచు తలుపుగొళ్లెము చేతఁబట్టుకొని శూన్యదృక్కులతో నిలువఁబడిపోయినాఁడు బాలుఁడు.

చాలదూరము రైలుప్రయాణముచేసివచ్చిన బాలుని యంగము లలసిపోయినవి. కేశములు రేగిపోయి వదనమునఁ దాండవించినవి. దుస్తులు మాసిపోయినవి. ఏమిచేయఁదోపక వెఱ్ఱివానివలె నిలువఁబడినాఁ డతఁడు.

ఆయిల్లాలు బాలునిఁగాంచి "ఎవరివాఁడవు? నాయనా!" అని పల్కరించినది.

అమాయికత్వము, అజ్ఞానము ఆక్రమించిన యతని అతికోమలమగు నంతరంగమునకు అనుకోని యాపలుకరింత అశనిఘాతము! సగమువాడిన

మోము పూర్తిగఁ గళాహీనమైనది. నింగిముట్టిన అతనియాశలు నేలమట్టమునకువచ్చినవి. ఏడేండ్ల కఠినవియోగమువెనుక లభించిన ప్రథమమాతృదర్శన మతని కర్థముకాని యంధకారమైనది. జన్మస్థలమునందలి దసరా పండుగలకు సరదామెండుకొనిన బాలుని లేయెడఁదలో భావము మెరుపువలె కళవళించినది. రుద్ధమైన కంఠములో నీరవించిన దుఃఖము నిలిచి యడ్డుపడినది. అజ్ఞేయవేదనాభారమున నతనిశీర్ష మవనతమైనది. అప్రయత్నముగా నయనములనుండి యశ్రుబిందువులు బొటబొట కారిపోయినవి. ఆయశ్రువులలో మూగవడిన విషాదమునకుఁ గలఁగి మేఘుఁడుకూడ బాష్పములు రాల్చినాఁడు.

కుమారునిబాష్పము లాయిల్లాలి యెడందఁదాకి మరపుపూతను దుడిచి మాయమొనర్చినవి. బాలునియాకృతిలో నేడేండ్లక్రిందట నెడఁబాసిన ముద్దుకుమారుని రూప మామెసద్యోవికసితమగు నంతర్దృష్టికి గోచరించినది. మడిఁగట్టుకొన్నమాట మరచిన మాతృలోకమతల్లి కుమారుని నొడిఁబెట్టుకొన్నది.

కట్టువడినకంఠముల మూగితనము; అన్యోన్యహృదయావేగనిస్వనముల మధురగానము. పరస్పరబాష్పధారాసమ్మేళనమునఁ బ్రేమలోకమే యిమిడిపోయినది. కొలఁది నిమిషములు నిశ్చలముగా నీరవముగాఁ గడచిపోయినవి.

* * *

వెనుక నాయిల్లాలు భర్తతోనన్నవాక్యము: "అన్నవస్త్రలోపమున సంతానము సంతప్తమైననగుఁగాక; పుత్త్రివంతులగు పగవారికయినఁ బుత్త్రిదానదారిద్ర్యముమాత్రమువలదు."

## ఆశీస్సు

శ్రీమతి సోము వేదము సీతారామమ్మగారు

శ్రీవినిర్మితనవ్యచిత్రసంచయకళా
  నికరమ్మునకు మేటినిధియటంచు
సాధ్వీమణులహృద్యసారస్వతవ్యాస
  రాజమ్ములకు స్థానరాజమనుచు
ఆంధ్రనారీసంచయారోగ్యభాగ్యంబు
  సుచిరమ్మొనర్చు కాణాచియనుచు
సీమంతినీజనాశేషసౌభాగ్యంబు
  విస్తరించెడు నవ్యవిదుషియనుచు
నతులకీర్తినిగాంచి, యీయాంధ్రభూమి
నుంటి విట్టులె చిరకాలముర్విమీద
నిత్యకల్యాణివగుచును నెగడుమమ్మ!
మహితగృహలక్ష్మి! స్త్రీజనమాన్యలక్ష్మి!